


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**

సంపుటి : 15 | సంచిక : 06 | ఫిబ్రవరి 2010





**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 20**

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


**ఈ సంచికలో....**


జిన్నూరు ....... 01-01-2010

కాపవరం ...... 28-11-2009

జిన్నూరు ....... 24-11-2009



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-01-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భగవాన్ 130వ జయంతి. శరీరం ఉన్నప్పుడు జన్మదినోత్సవం అంటారు, శరీరం పడిపోయాక జయంతి అంటారు. భగవాన్ శరీరం తీసుకొన్న క్షేత్రం తిరుచ్చుళి, అది శివక్షేత్రం. ఆయన మధురైలో చదువుకొన్నారు. ఇప్పుడు మీరు ఏదైనా మంచి చేసారు అనుకోండి అది వెంటనే ఫలించకపోవచ్చు, ఈ జన్మలోనే ఫలించక పోవచ్చు, కొన్ని జన్మల తరువాత దాని ఫలితం రావచ్చు, అది దైవనిర్ణయాన్ని బట్టి వస్తుంది. అందుచేత మీకు మంచి చేయాలన్నప్పుడు ఆలస్యం లేకుండా వెంటనే చేసేయాలి. ఫలితం ఎప్పుడు రావాలో అప్పుడు వస్తుంది. భగవాన్ 10వ తరగతి చదువుతుండగా మరణానుభవం ద్వారా మరణాన్ని జయించారు, అది దేవరహస్యం, అది ఆయన పూర్వజన్మల పుణ్యఫలం. బ్రహ్మపదార్థం సూక్ష్మాతిసూక్ష్మంగా మన హృదయంలో ఉంది. మనందరం పెద్దవారము అయిపోవాలి అనుకొంటాము. సంఘంలో గౌరవం సంపాదించాలి, తలఎత్తుకొని తిరగాలి, పేరు సంపాదించుకోవాలి, సంఘంలో కీర్తి సంపాదించాలి అనుకొనే భక్తులకు కోటిజన్మలు ఎత్తినా వారికి ఆత్మజ్ఞానం కలుగదు. వారు పూజలు చేయవచ్చు, పూజలు చేస్తే పుణ్యం వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది, కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. మనం వందకోట్లు డబ్బు సంపాదించాము అనుకోండి ఎంతమంది తింటే ఇది తరుగుతుంది అని మనం లెక్కలు వేసుకొంటాము కాని ఆ డబ్బు ఎలా వచ్చిందో అలాగే పోతుంది. ఇక్కడ రహస్యం ఏమిటి అంటే ఆ వందకోట్లు సంపాదించేటప్పడే అది ఎప్పుడు పోవాలో ముహూర్తం పెట్టాకే వీడికి ఆ

సంపాదన ఇస్తాడు, అది మనకు తెలియదు. పెద్దపెద్ద సామ్రాజ్యాలే కాలప్రవాహంలో కొట్టుకొనిపోయాయి. మనకు ఏదైనా అధికారం వచ్చింది అనుకోండి, అది ఇలాగే ఉండిపోతుంది అనుకొంటాము. కాలప్రవాహంలో అదీ పోతుంది. ఈ శరీరం కూడా అంతే, ఒక కాలంలో మనకు ఈ శరీరం వచ్చింది, ఇంకొక కాలంలో ఈ శరీరం పోతుంది. కాలప్రవాహంలో మన శరీరమే పోతుంది కదా ఇంక శరీరం బయట ఉన్నవి పోవటం ఎంతసేపు. నా శరీరమే నాది కానప్పడు ఈ సృష్టిలో ఏది నాది అవుతుంది అనేవాడు గౌతమబుద్ధుడు. మన పేరు అందరికీ తెలిసిపోవాలి, సమాజంలో ప్రముఖస్థానం సంపాదించాలి అనుకొనేవారికి ఎవ్వరికీ ఆత్మజ్ఞానం రాదు. కొంతమంది ఇంట్లోకూడా పెత్తనం చెయ్యాలని సరదా పడుతూ ఉంటారు. కొంతమంది తెలివైనవారు ఎలా ఉంటారు అంటే వారు ఇంటిని మేనేజ్ చేసినా వారు మేనేజ్ చేస్తున్నారు అనే భావన ఇంట్లోవారికి కూడా రాకుండా చూసుకొంటారు, అది వైజ్ బిహేవియర్.

కామము, క్రోధము, లోభము ఇవి మూడూ నరకానికి గేట్లు. కామము అంటే కేవలము స్త్రీ, పురుష సంబంధం కాదు. మనకు ఏ కోరిక ఉన్నా అది కామమే. అంటే ప్రపంచంలో నాకు అది కావాలి, ఇది కావాలి అని ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము కదా, అది అంతా కామమే. ఉన్నదంతా మన హృదయంలోనే ఉంది. ఇప్పడు మనం కోరుకోవటం వలన ఏదీ రాదు, కోరుకోవటం మానేస్తే మన ప్రారబ్దంలో ఉన్నది పోదు. ఆ సిద్దాంతం మీకు తెలియాలి. ఏదైనా సరే మన దేహప్రారబ్దంలో వచ్చే యోగం ఉంటే మన కోరికతో సంబంధం లేకుండా వచ్చేస్తుంది. మనకు కోరిక ఉన్నా అది దేహప్రారబ్దంలో వచ్చేయోగం లేకపోతే బంగారపు కొండ మీద దొర్లినా మనకు ఏమీ అంటుకోదు, అది జ్ఞాపకం పెట్టుకోండి. కోరిక వలన ఏమీ రాదు, దేహప్రారబ్దంలో ఏది ఉంటే దానిని తప్పించుకోలేము. వస్తువు మన హృదయంలోనే ఉంది కాని మనం అక్కడకు వెళదాము, ఇక్కడకు వెళదాము, యాత్రలకు వెళదాము అంటే హృదయంలో ఉన్న బంగారాన్ని వదిలేసి పెంకుముక్కలకోసం వెతుక్కొంటున్నాము. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అని మనకు అనిపిస్తోంది. మన కోరికలను బట్టి అలా మనకు అనిపిస్తోంది కాని బయట ఏమీ లేదు. ఇది మనకు అర్థమవ్వాలి. కోరిక, క్రోధము, లోభము ఇవి మూడూ ఎన్నో జన్మల నుండి మీలో గూడుకట్టుకొని ఉన్నాయి, వాటికి లోపల ఉండటం అలవాటు అయిపోయింది, బయటకు తోలినా వెళ్ళనంటున్నాయి. మీరుసజ్జనసాంగత్యం చేస్తూ, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ సాధన చేసి వాటిలో నుండి విడుదల పొందితే మీ హృదయంలో ఉన్న బంగారం మీకు ఎరుకలోనికి వస్తుంది, అదే కడసారిజన్మ.

కామక్రోధాల గురించి మనకు డీటైల్‌గా అర్థమయ్యేలాగ తులసీదాసుగారు చెప్పారు. ఈ

కామం ఒక తీగలాంటిది ఆనపకాయపాదు పెట్టి అది పాకటానికి ఒక పందిరి వేస్తాము. ప్రతివాడిలోనూ కామం ఉంటుంది. ఆ కామాన్ని పెళ్ళి పెంచేస్తుంది అని చెప్పాడు. మా అబ్బాయి బుద్ధిమంతుడు అని తల్లి అంటుంది, పెళ్ళి అయ్యాక మారిపోయాడు అని చెపుతుంది. ఆ మారిపోవటం ఏమిటో మనకు తెలియదు. ఈ రహస్యం అంతా కామంలో ఉంది అని తులసీదాసు చెప్పారు. భర్తకి కామం ఉంది అనుకోండి, అది పెరగటానికి భార్య పందిరిలాగ ఉపయోగపడుతుంది. కామం అనే తీగ పెరగటానికి భార్యకు భర్త పందిరి, భర్తకు భార్య పందిరి, ఇలా ఒకరికి ఒకరు ఉపయోగపడుతూ ఉంటారు, కామం అలా పెరిగిపోతూ ఉంటుంది, ఇంక అది ఆరదు. ఏదో కాలక్షేపం కోసం సాధన చేస్తారు, గుడులు చుట్టూ తిరుగుతారు అదీ కోరికలు నెరవేర్చుకోవటానికి అలా చేస్తారు. దీనివలన కామం తగ్గదు సరికదా కామం పెరిగిపోతుంది. అసలు మనకు ఆత్మజ్ఞానం అక్కరలేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు. కొంతమంది బాగా సంపాదిస్తారు. వారి గర్వం అంతా ఇంట్లో వారిమీద చూపిస్తూ ఉంటారు. కోపం ఉన్నవారు అందరూ పరుషవాక్యాలు మాట్లాడతారు. వారి నోటినుండి మంచిమాటలు రావు, చెడ్డమాటలే వస్తాయి. ఏ మాట అనాలో, ఏ మాట అనకూడదో వారికి తెలియదు. మన సంసారానికి సరిపడ సంపాదన ఉంటే సరిపోతుంది. ప్రారబ్దాన్ని బట్టి డబ్బు పెరుగుతోంది అనుకోండి, ఎంత డబ్బు పెరుగుతూ ఉంటే అంత ఆశ పెరుగుతుంది అది మనకు తెలియదు. అంటే సంపాదన ఆశను పెంచేస్తుంది, పెళ్ళి కామాన్ని పెంచేస్తుంది, పరుషవాక్యాలు కోపాన్ని పెంచేస్తాయి అని తులసీదాసుగారు చెప్పారు. సామాన్య సంసారంలో ఉన్నప్పడే చాలామంది ఎవరో ఒకరికి సహాయం చేస్తూ ఉంటారు. డబ్బు పెరిగాక అంతకుముందున్న వితరణ కూడా పోతుంది. మీరు ఏవైనా మంచిపనులు చేయాలన్నప్పడు మామూలుగా మధ్యతరగతి ప్రజల మీదే ఆధారపడండి, ధనవంతులమీద ఎప్పడూ ఆధారపడవద్దు అని వివేకానంద చెప్పేవారు.

మనకి గురువు సుమిత్ర. సుమిత్ర చాలా గొప్పవ్యక్తి. సుమిత్రకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు ఇద్దరు పిల్లలు. మన పిల్లలు చక్రవర్తులు అయిపోవాలి, రాముడిలాగ అయిపోవాలి అని ఆవిడ అనుకోలేదు. సుమిత్రది నూటికి నూరుపాళ్ళు సేవాభావం. లక్ష్మణుడిని రాముడికి సేవ చేయమని చెప్పింది, శత్రుఘ్నుడిని భరతుడికి సేవచేయమంది. అంటే సేవారంగానికి తన కొడుకులను అప్పగించింది. అదీ సంతోషంగా, శాంతిగా చేసింది. ఆవిడ హృదయంలో ఉన్నది సేవాభావమే. మన సంతానాన్ని సేవారంగానికి ఎంతమంది అప్పగించగలము, ఎవరూ ఇవ్వలేము. ఆవిడ ఒక మహారాజుకి భార్య అయి ఉండి, వారు మహారాజు కొడుకులు అయి ఉండి వారిని సేవారంగానికి ఇచ్చింది, అది గొప్పతనం. రాముడిని అరణ్యానికి పంపినప్పడు అందరూ కైకను అసహ్యించు

కొన్నారు కాని సుమిత్ర అసహ్యించుకోలేదు, అది ఈశ్వర నిర్ణయం అంది. అంతకుముందు కైకపట్ల ఎలా ఉందో ఈ సంఘటన జరిగిన తరువాత కూడా అంత కూల్‌గా, అంత నిర్మలంగా ఉంది. రాముడు అరణ్యానికి వెళ్ళినప్పుడు కౌశల్యను ఒప్పించటం చాలా కష్టం అయ్యిందికాని సుమిత్ర లక్ష్మణుడిని ఆశీర్వదించి పంపింది. ఈ ఆధ్యాత్మిక రంగంలో హృదయం యొక్క లోయలలోనికి చేరుకోవటానికి ప్రయత్నం చేసేటప్పుడు ఇతరులమీద ఆధారపడవద్దు, ఎవరో వచ్చి సహాయం చేస్తారని ఎదురు చూడవద్దు, మన కాళ్ళమీద మనం నిలబడి అభివృద్ధిలోనికి రావటానికి ఎవరికి వారు ప్రయత్నం చేస్తూ ఉంటే మీరు తప్పనిసరిగా తరిస్తారు. ఆహారం విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి. ఈ పొట్ట ఏదో కావాలి అంటుంది, ఎప్పుడు తినేద్దామా అని నోటికి కంగారు, ఎప్పుడు సినిమాకు వెళ్ళిపోదాము, టీవీ ఎప్పుడు చూసేద్దాము అని నీ కళ్ళకు కంగారు. శరీరంలో ఉన్న అన్ని ఇంద్రియాలు వేగంగా వెళ్ళిపోతూ ఉంటే ఇంక సాధన ఏమిటి? మనం అందరం కూడా మనకు కావలసిన దానికంటే ఎక్కువ తినేస్తున్నాము అని మనకు తెలియటం లేదు. మీరు ఎక్కువ తినేస్తారు అనుకోండి, ఆలోచనా శక్తి తగ్గిపోతుంది. ఎక్కువ తినేసేవాడికి జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీకు ఏదైనా రోగం వస్తే ఔషదం ఎలా వాడతావో అలాగే ఆకలి అనే రోగానికి సరిపడ అన్నంపెట్టు అని చెప్పారు.

మనం మాట్లాడేమాట, చేసేపని నిర్మలంగా ఉండాలి. ఏ పనీ గొప్పలకోసం చేయవద్దు. లోకంలో మెప్పకోసం పనులు చేయవద్దు, ఈశ్వరునిదయ సంపాదించటానికి పనులు చెయ్యండి. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధి పొందటానికి ఎవరికి వారు సాధన చేయవలసిందే. తల్లి ఏదో సహాయం చేస్తుంది అని కూతురు, కూతురు సహాయం చేస్తుందని తల్లి ఇలా ఎదురుచూడటం వలన ప్రయోజనం లేదు, ఇందులో ఒకరికి ఒకరికి సంబంధం లేదు. మనం ఒంటరిగా ఈ భూమి మీదకు వచ్చాము, మరల ఒంటరిగా ఈ భూమిని విడిచిపెట్టిపోవలసిందే. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవిస్తూ మీరు జాగ్రత్తగా సాధన చేస్తూ ఉంటే ఈ జన్మలోనే తరిస్తారు. సముద్రం వర్షాకాలంలో పెరిగిపోదు, వేసవికాలంలో తరిగిపోదు. నదులు వెళ్ళి కలిసినా అలాగే ఉంటుంది, నదులు వెళ్ళి కలవకపోయినా అలాగే ఉంటుంది. జ్ఞానిస్థితి అలాగే ఉంటుంది. వాడి కోరికలు అన్నీ నెరవేరినా వాడికి ఏమీ అనిపించదు, ఒక్క కోరిక కూడా నెరవేరకపోయినా వాడికి ఏమీ అనిపించదు, నిర్మలంగా నిశ్చలంగా ఉంటాడు, వాడు సముద్రుడు, వాడు జ్ఞాని. నిరంతరం కోరికల గొడవలలో ఉన్నవారు, నిరంతరం ప్రకృతి గొడవలలో ఉన్నవారు సముద్రంలాగ నిండుగా ఉండలేరు గురువు అంటే మీరు సామాన్యం అనుకోవద్దు. రమణుడు, రామకృష్ణుడు వారు మహాజ్ఞానులు, వారు

సామాన్యులు అనుకోవద్దు. మీ పూర్వపుణ్యాన్నిబట్టి మీకు ఒక మహాజ్ఞానిమీద, ఆయన పాదాలమీద విశ్వాసం కుదిరితే ఇంజనుకు తగిలించిన పెట్టెలను ఆ ఇంజను ఎలా లాగుకొనిపోతుందో అలాగే ఆయన మిమ్మల్ని తీసుకొనిపోయి మోక్షంలో పడేస్తాడు. వాడు గురువు. పూర్వపుణ్యం లేకపోతే ఆయన మీద మీకు విశ్వాసం కలుగదు. పూర్వజన్మలో మనం సత్కర్మ చేయలేదు అనుకోండి, సజ్జనసాంగత్యం చేయలేదు అనుకోండి, శాస్త్రాన్ని శ్రవణం చేయలేదు అనుకోండి మనకు ఏ మహాత్ముడి మీదగాని, అవతార పురుషుడిమీదగాని భక్తి కలుగదు.

రామకృష్ణ పరమహంసగారు ఏమన్నారు అంటే ఎక్కడికి వెళ్ళినా ఈ నేను గొడవ ఏమిటి? నేను మాట్లాడాను, నేను అలా చేసాను, నేను అది సాధించాను అని ఎక్కడికి వెళ్ళినా ఈ నేను గొడవే, వినలేకపోతున్నాను. ఇంక ఈ నేను గొడవ వదిలేయండి. నువ్వు నువ్వు అనండి అన్నాడు రామకృష్ణుడు. నువ్వు అంటే భగవంతుడు. మీరు ఏదైనా మంచి పని చేసినా నేను చేసాను అనకండి, నువ్వే చేసావు అనండి. అస్తమాను ఆ నేనును తలపెట్టుకొంటూ అందులో నుండి ఎలాగ బయటకు వస్తారు. నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో అది దేహగతమైనది, మనోగతమైనది. సత్యమైననేను ఒకటి నీ హృదయంలో ఉంది. దానికి పరిమితులు లేవు, హద్దులు లేవు. ఏ నేనునైతే నువ్వు విడిచిపెట్టాలో దానితోటి ఉంటూ, దాని గురించే అస్తమాను ఆలోచిస్తూ ఉంటే ఇంక దానిని ఎలా విడిచిపెట్టగలవు. జ్ఞానం అంటే ఏమిటి అంటే ఏదైతే మనం నేను, నేను అని అంటున్నామో ఆ నేను నేనుకాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. నువ్వు చెప్పే నేను నువ్వు కాదని తెలుసుకోవటమే జ్ఞానం. అందరి హృదయాలలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. మనం కేవలం కీలుబొమ్మలం మాత్రమే. ఆడించేవాడు మనలోపలే ఉన్నాడు. మనం ఆడించేవాడిని వదిలేసి ఆడే బొమ్మలను పట్టుకొని తిరుగుతున్నాము అన్నాడు రామకృష్ణుడు. చంటిపిల్లలు ఏడిస్తే నాలుగు బొమ్మలు ఎదురుగా పడేస్తే వాటితో ఆడుకొంటూ కాలక్షేపం చేస్తారు. మనం కూడా అంతే ఈ బొమ్మలతో ఆడుకొంటూ కాలక్షేపం చేసి చనిపోతున్నాము. అంతర్యామిగా ఉన్న నారాయణుడిని వదిలేస్తాము. ఉదయం నుండి పళ్ళు ఇస్తున్నారు మేము పుచ్చుకొంటున్నాము. ఇప్పుడు మరల ముందుగా మా పళ్ళు పచ్చుకోండి అంటున్నారు. మీటింగు తరువాత చెపుదురుగాని ముందు పళ్ళు పుచ్చుకోండి అంటున్నారు. ఇలా అయితే ఇంక ప్రవచనం ఎప్పుడు, జ్ఞానామృతం ఎప్పుడు. అంత తొందరైతే ఎలాగ. అక్కడ భగవాన్ పటం ఉంది, అది పటం అనుకోవద్దు. మీకు ఎవరికైనా తొందరపని ఉంటే ఆ పటం దగ్గర పళ్ళు పెట్టేసి వెళ్ళిపోవచ్చు. ఇక్కడ భయం ఏమిటి అంటే ఆ పటం గుర్తించిందో లేదో అని. ఈ రెండు అరటిపళ్ళకు, బత్తాయిలకు మరల పెద్ద గుర్తింపులు కావాలి. అసలు ఈ గుర్తింపులకు

అలవాటు పడిపోయి మనం పాడైపోతున్నాము అన్న సంగతి మనకు తెలియటం లేదు. భగవాన్ పటాన్ని బొమ్మ అనుకోవటం ఎందుకు భగవానే అనుకోవాలి, అప్పుడు వాడు తరిస్తాడు. అసలు త్యాగం అనేది ఎందుకు పెట్టారు అంటే ఎప్పటికైనా మనం కానిది మనం వదిలేయటానికే త్యాగం. మనకు దేహబుద్ధి ఉంది. త్యాగికానివాడు దేహబుద్ధిని వదిలిపెట్టలేడు.

ఉపనిషత్‌లలో ఒక కథ వస్తుంది. దేవతలు, రాక్షసులు, మానవులు ముగ్గురు బ్రహ్మదేవుడి దగ్గరకి వెళ్లి మాకు ఏదైనా ఉపదేశించండి అన్నారట. ముగ్గురికి ఒకటే ఉపదేశం 'ద' అన్నాడు. దేవతలకు ఉపదేశం 'ద' అంటే దమం నేర్చుకోండి అంటే నిగ్రహం నేర్చుకోండి. దేవతలు ఎక్కువ భోగాలకు అలవాటు పడిపోయారు. భోగాలకు ఎక్కువ అలవాటుపడినవారు దమం నేర్చుకోవాలి అంటే మనస్సును నిగ్రహించుకోవాలి. భోగజీవితం వలన పాడైపోతారు, భోగజీవితం వలన మోక్షం రాదు. త్యాగ జీవితం వలన, యోగజీవితం వలన మోక్షం వస్తుంది. రాక్షసులకు ఉపదేశం 'ద' అంటే దయ. రాక్షసులకు క్రూరత్వం ఉంటుంది. కొంతమంది ఎవరికైనా కష్టం వస్తే సంతోషిస్తారు, అటువంటి మనుషులు ఉంటారు. ఇటువంటి రాక్షస స్వభావం ఉన్నవారికి దయ అనేది ఉండదు. అందుచేత రాక్షసులకు దయ నేర్చుకోండి అని చెప్పాడు. ఇంక మానవులకు ఉపదేశం 'ద' అంటే మానవులలో ఎక్కువమందికి లోభిత్వం ఉంటుంది. అందుచేత 'దానం' నేర్చుకోండి అని చెప్పాడు. చేతినిండా డబ్బు, ఇంటి చుట్టూ కార్లు ఉన్నాయని విచ్చలవిడిగా ఉండకండి, దాని వలన లోపల కుళ్లిపోతారు. ధనం కోసమే అక్కాచెల్లెలకు, భార్యాభర్తలకు పేచీలు. మానవులకు దానం నేర్చుకోండి అని చెప్పాడు. మీరు ఎవరికైనా ఏదైనా సహాయం చేస్తే వారు కోటీశ్వరులు అయిపోరు. ఎవరో కొంతమంది తీసుకొనేవారు ఉన్నారు కాబట్టి మీకు ఇచ్చే అవకాశం ఉంది అలా చూసుకోండి అంతేగాని మీరు గర్వం పెంచుకోవద్దు. దానం అనేది అర్థం చేసుకొంటే నువ్వు ఏదైతే కాదో దానిని విడిచిపెట్టేస్తావు. అప్పుడు దేహవాసన పోతుంది, లోకవాసన పోతుంది, శాస్త్రవాసన పోతుంది, నీ మనస్సుతో తాదాత్మ్యం పోతుంది. నువ్వు కానిది విడిచిపెట్టేస్తే నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక ఎరుక నీకు వస్తుంది.

లోకంలో గౌరవం పొందాలి, ఏదో ప్రముఖస్థితిని పొందాలి అనే తత్వంతోటి మనం పాడైపోతున్నాము. మీరు నిర్వాణసుఖాన్ని పొందటంకోసం ప్రయత్నం చేయటం మానేసి ఈ ప్రకృతి గొడవలు, ఈ అల్లర్లు ఏమిటి అంటున్నాడు గౌతమబుద్ధుడు. మనకు అవసరం లేని గొడవలలోనికి వెళ్లి అజ్ఞానాన్ని పెంచుకొంటున్నాము. అందుచేత ఎవ్విరిడే ట్రైటు రినౌన్స్ ప్రామినెన్స్. ఇది సాధనలో ఒక భాగం. భగవంతుడు ఒకో మనిషికి ఒకో పనిని కేటాయిస్తాడు. ఆ పనిని మీరు రియాక్షన్ లేకుండా చేయాలి. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. భగవంతుడు మీకు కేటాయించిన

పనిని జాగ్రత్తగా, శ్రద్ధగా చేయాలి. మన చేతిలో ఉన్న పనిని నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయాలి. పనిని మనం బలవంతాన విడిచిపెట్టేయకూడదు. పని మనలను విడిచిపెట్టేసింది అనుకోండి దానివలన మనకు నష్టం లేదు. మనం ఎంతసేపు వైకుంఠానికి వెళ్ళిపోదాము, కైలాసానికి వెళ్ళిపోదాము అని చూస్తాము. మనస్సు యొక్క వేగం అలా ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా నీ మనస్సే కదా. అది నిన్ను విడిచిపెట్టటం లేదు కాశీ వెళ్ళినా, రామేశ్వరం వెళ్ళినా నీ మనస్సు నీకూడా వచ్చేస్తుంది. నువ్వు దానిని వదిలించుకోవాలి. వైకుంఠాల గొడవ, కైలాసాల గొడవ వదిలేసి, చావు పుట్టుకల గొడవ వదిలేసి, పుణ్యపాపాల గొడవ వదిలేసి మీ మనస్సును నిర్మలం చేసి, నిశ్చలం చేసి, పవిత్రం చేసి, దానిని అంతర్ముఖం చేసి ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో ఎక్కడైతే బ్రహ్మం ఉందో అక్కడకు అంటే మీ హృదయంలోనికి మనస్సును నెట్టుకొనిపోవటానికి ప్రయత్నం చేసాడు అది భగవాన్ చేసిన పని. నువ్వు ప్రశాంతంగా ఉండి, నీ పని ఏదో జాగ్రత్తగా చేసుకొంటూ, మనస్సును అంతర్ముఖం చేయటానికి ప్రయత్నం చెయ్యి. పరమపవిత్రుడికిగాని మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఎప్పుడైతే మనస్సు పరమపవిత్రం అయ్యిందో అది హృదయంలోనికి వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవుతుంది. అప్పడు నువ్వు పోవు. నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి వస్తుంది. దాని స్వరూపం సుఖం కాబట్టి సుఖంకోసం ఇంక నీవు బయట వెతకవలసిన అవసరం లేదు.

ప్రతీ మనిషికి సుఖం కావాలి కాని అది ఎక్కడ ఉందో మనకు తెలియటంలేదు, ఎలా పొందాలో తెలియటంలేదు. అది ఎక్కడ ఉందో, దానిని ఎలా పొందాలో మీకు తెలియజేసి అక్కడకు మిమ్మల్ని తీసుకొనిపోవటానికి ప్రయత్నం చేసాడు, వాడు రమణగురువు. దీనికి మధ్యవర్తులతోటి సంబంధం లేదు, దేవతలతో సంబంధం లేదు, డైరెక్టుగా మీ మూలంలోనికి మిమ్మల్ని పంపటం, అక్కడకు వెళ్ళిన తరువాత మీరే సుఖం అయిపోతారు. అసలు మీకు ఏ చింతన రాదు. సుఖం లేనివాడు సుఖంకోసం తిరుగుతాడు. సుఖి సుఖంకోసం ఎక్కడ తిరగాలి, వాడే సుఖం కాబట్టి ఇంక సుఖంకోసం బయట తిరగవలసిన పనిలేదు. మేము చాలా చాకిరీ చేస్తున్నాము, ఎవరూ గుర్తించటంలేదు అని చాలామంది అంటారు. అక్కడే మీరు పాడైపోతున్నారు. అసలు గుర్తింపులు జోలికి వెళ్ళకండి. ఇతరులు మనల్ని గుర్తించాలి అనే భావన మీకు ఎప్పుడైతే వచ్చిందో మీకు వ్యక్తిభావన పెరిగిపోతుంది, దేహబుద్ధి పెరిగిపోతుంది. భగవద్గీత చాలాసార్లు చదువుతాము. మాకు అర్థమయింది, మాకు తెలిసిపోయింది అనుకొంటాము కాని భగవద్గీతలో మనకు తెలియని విషయాలు చాలా ఉంటాయి. ఎందుచేతనంటే మనవి చిన్న తలకాయలు. ఈ సృష్టిలో ఒకో మనిషి ప్రవర్తన ఒకోలాగ ఉంటుంది, క్రూరత్వం ఉంటుంది, ఎందుకు అలా ఉంది అంటే అవి మనం ఊహించలేము, అవి మన తలకాయకు అందని విషయాలు. అందుచేత మనకు ఎంతవరకు అర్థమైతే అంతవరకూ సాధన చేసి మనం

తరించాలి కాని మనకు అందని విషయాల గురించి ఆలోచిస్తూ మన తలకాయ పాడుచేసుకోకూడదు. ఒక మనిషికి డబ్బు ఉండవచ్చు, పాండిత్యం ఉండవచ్చు. దాని వలన ప్రమాదం లేదు. ఆ డబ్బుతోటి, పాండిత్యంతోటి తాదాత్మ్యం పొందటంవలన అహంకారం పెరిగిపోతుంది. మీరు ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోనక్కరలేదు. మీ ఇంటిలో ఉండి మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకొంటూ అహంభావనను తగ్గించుకోవటానికి సాధన చెయ్యండి. మనిషి అయ్యాక ఎప్పడైనా అవమానాలు వస్తూ ఉంటాయి, వాటిని కూడా భరించటం నేర్చుకోండి. అది కూడా సాధనలో ఒక భాగము. మనోదేహములనుండి, లోకవాసనలనుండి, నువ్వుకాని గొడవలనుండి నీకు స్వేచ్ఛ ఎప్పడు కలుగుతుంది అంటే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు ఎరుకలోనికి వచ్చినప్పడు వాటి నుండి విడుదల పొందుతావు, నీకు నిజమైన స్వేచ్ఛ కలుగుతుంది.

మీరు సత్వగుణం అభివృద్ధి చేసుకోండి. మీ మాట, చేత, ఆలోచన సౌమ్యంగా ఉండాలి. మీరు ఎవరినైనా ప్రేమించగలిగితే ప్రేమించండి. ఎవరినీమాత్రం ద్వేషించవద్దు. ప్రాణం పోసే శక్తి నీకు లేదు అందుచేత ఎవరి ప్రాణం తీయవద్దు. సాత్వికులు ధన్యులువారు దేవుని చూచెదరు. కొంతమంది ఎప్పడూ ఇతరులను ఏదో ఒకటి అంటూ ఉంటారు, తిడుతూ ఉంటారు. అన్నవాళ్ళకంటే పడ్డవాళ్ళు గొప్పవాళ్ళు అని పెద్దలు చెపుతారు. అలా ఏదో ఒకటి అనటం వలన, తిట్టటం వలన, వాగాడంబరం వలన కోపం పెరిగిపోతుంది, రజోగుణం పెరిగిపోతుంది. ఆ మాటలను భరించటం వలన మన మనస్సు హృదయంలో ఉన్న సత్యం వైపుకు ఉపసంహరింపబడుతుంది. కుటుంబంలో ఉన్నప్పడు ఏవో గొడవలు వస్తూ ఉంటాయి, ప్రతీదీ రాద్ధాంతం చేసేసుకోకండి. మీ తప్ప లేకపోయినా ఒకోసారి మీ ఇంట్లోవారు మిమ్మల్ని ఏదో ఒకటి అంటూ ఉంటారు. వాటిని పెద్దవి చేసేసుకోకుండా, వాటితో రాజీపడటం నేర్చుకోండి. అంతేగాని ఈ గొడవలు, కక్షలు పెట్టుకొని అసలు గమ్యాన్ని విడిచిపెట్టవద్దు. మనం ఎటువంటి పరిస్థితులలో ఉన్నామో భగవంతుడికి తెలియదా, ఆయనే ఇటువంటి పరిస్థితులు పెట్టాడు, మన మంచికోసమే ఇది అంతా చేస్తున్నాడు అని అర్థం చేసుకొని కాలక్షేపం చేయండి. అలా జీవిస్తూ ఉంటే ఒకవేళ మీకు వెంటనే మోక్షం రాకపోయినా ఇప్పడు మీరు పడే బాధలు వచ్చే జన్మలో రావు. మీరు తాత్కాలిక ఉద్రేకాలకు పోయి గమ్యాన్ని మరిచిపోవద్దు. ఈ శరీరంలో ఉండగానే మనం పునర్జన్మలేని స్థితికి ఎదిగి వెళ్ళాలి. మీకు ఇంటినిండా సంపద ఉన్నా మీ మాటలో, ప్రవర్తనలో, మీ ముఖంలో అవినయం కనుక ఉంటే ఆత్మజ్ఞానసముపార్జన సాధ్యంకాదు. నా ప్రవర్తనలో అవినయం లేకుండా చూడు అదే నా మొదటి ప్రార్థన, చివరి ప్రార్థన అన్నారు ఆచార్యులవారు. ఎక్కడైతే వినయం ఉందో అక్కడ జ్ఞానం ఉంటుంది కాని అవినయం ఉన్న చోటుకు జ్ఞానంరాదు. మీరు ఇంటి దగ్గర సాధ్యమైనంతవరకు సమానంగా ఉండటానికి

ప్రయత్నం చేయండి. ఇంటి దగ్గర గౌరవిస్తున్నారు అని పొంగిపోవద్దు, గౌరవించటంలేదని కుంగిపోవద్దు. అలా పొంగు, కుంగు ఉంటే ఇంక మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. అంతర్దృష్టిలేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. హిరణ్యకశిపుడు భౌతికవాది, ప్రహ్లాదుడు ఆధ్యాత్మికవాది. మనందరం ప్రహ్లాదుడి పార్టీలో ఉండాలి. ప్రహ్లాదుడిని తండ్రి అనేక కష్టాలు పెట్టాడు. ఆ కష్టాలు అన్నీ భరించాడు కాని నన్ను ఇన్ని కష్టాలుపాలుచేస్తున్నాడు అని మనస్సులో తండ్రి మీద వికారం రాలేదు. మనలను ఎవరైనా బాధపెడుతూ ఉంటే మనం సహించినా వారు బాధపెడుతున్నారు అని మనస్సులో ఉంటుంది, అది కూడా ప్రహ్లాదుడికి లేదు, వాడు భక్తులలో అగ్రగణ్యుడు. అంటే ఏమీ వికారం లేకుండా అన్నీ భరించాడు పైగా వాడిని ఎవడైతే కష్టాలు పెట్టాడో వాడిమీద ద్వేషభావం లేదు. అందుచేత మనకు ప్రహ్లాదుడు గురువు, సుమిత్రాదేవి కూడా మనకు గురువు. సంసారపక్షంగా సుమిత్రాదేవిని జ్ఞాపకం పెట్టుకొంటే, ఆ రకంగా మనం జీవిస్తే ఈ జన్మలోనే తరిస్తాము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2009, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గీతాజయంతి. ప్రపంచ సాహిత్యంలో ఒక్క భగవద్గీతకు తప్పించి ఏ పుస్తకానికి జయంతులు చేయరు. భగవద్గీత మన దగ్గర ఉంటే నాలుగు వేదాలు మన దగ్గర ఉన్నట్లే. భగవద్గీతలో జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం అన్నింటి గురించి వివరంగా చెప్పాడు. మనం ఏ పని చేసినా భక్తి అవసరం. ఇది దేవుడి పని, ఇది లోకానికి సంబంధించిన పని అని మనం విడదీస్తాము. అలా మనం విడదీయకూడదు. ఈ సృష్టిరూపంలో ఉన్న వాడు భగవంతుడే. మనం భగవంతుడిని ఎలా పూజిస్తామో మనం ప్రపంచంలో పని కూడా అలాగే చేయాలి. భగవద్గీతను అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొంటే మనం గమ్యానికి చేరుకొంటాము. ప్రపంచంలో అనేక కోట్ల జనం ఉన్నారు, అందరి మనస్తత్వాలకు తగిన సమాధానం భగవద్గీతలో దొరుకుతుంది. మీకు అశాంతిగా ఉంది అనుకోండి, దుఃఖంగా ఉంది అనుకోండి, గీతలో ఏదో ఒక శ్లోకం మీ దుఃఖాన్ని ఆర్పేస్తుంది. మీరు అర్థం చేసుకోకుండా చదివినా పుణ్యం వస్తుంది. అర్థం చేసుకొని చదువుతూ ఉంటే మీకు శాంతి కలుగుతుంది. భగవద్గీత సమన్వయ గ్రంథం, ఉపదేశ గ్రంథం, అర్జునుడిని వంపు పెట్టుకొని పరమాత్మ మన గురించి చెప్పిన శాస్త్రం. భగవద్గీతలో శంకరాచార్యులవారు అద్వైతం చూస్తే, మధ్వాచార్యులు ద్వైతం చూసారు, రామానుజాచార్యులు విశిష్టాద్వైతం చూసారు. అంటే ఎవరి కోణంలో వారు వ్యాఖ్యానాలు వ్రాసారు. తిలక్‌గారు కర్మయోగం గురించి ఎక్కువ వ్రాసారు. మన బుద్ధిని బాగు చేసుకోవటం కంటే మించిన పని ప్రపంచంలో ఏదీ లేదు. నీ బుద్ధిని నువ్వే బాగుచేసుకో,

ఎవరో వచ్చి బాగుచేస్తారని కనిపెట్టుకొని ఉండకు. ముక్కులో గాలి బయటకుపోతే కుటుంబంలో ఉన్న వారితో సంబంధం పోతుంది. ప్రారబ్ధాన్ని బట్టి ఆ కుటుంబంలో కొంతకాలం ఉంటాము, తరువాత వెళ్ళిపోతాము. మీరు తరించాలి. మీరు ఆత్మసుఖాన్ని పొందాలి. మీ హృదయంలో తప్పించి బయట ఎక్కడా సుఖం లేదు. మీరు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా, ఎన్ని కోట్లు సంపాదించినా బాహ్యంగా సుఖాలు అనుభవిస్తున్నా అవి అన్నీ దుఃఖంగా మారిపోతాయి. మీరు పండితులు అయితే పొగుడుతూ ఉంటారు, మీకు బాగా డబ్బు ఉంటే పొగుడుతూ ఉంటారు, సంసారంలో సుఖాలు ఉంటాయి. ఇలా ప్రపంచంలో నుండి వచ్చే ఏ సంతోషం అయినా, ఏ సుఖం అయినా రెట్టింపుకి రెట్టింపు దుఃఖంగా మారిపోతుంది.

కోరిక, కోపము, ద్వేషము, అసూయ, మోహము, లోభిత్వం ఇవి అన్నీ మన లోపల ఉన్న శత్రువులు. మీకు అర్థమవ్వటం కోసం ఇలా చెపుతున్నారు గాని ఇంతమంది శత్రువులు లేరు, ఒక్కడే శత్రువు, వాడే కోరిక, వాడే రకరకాలుగా మారుతున్నాడు. మీకు కోరిక లేకపోతే కోపంతోటి, అసూయతోటి, లోభిత్వంతోటి పని ఏముంది. జ్ఞానం సంపాదించాలనుకొనేవాడికి శత్రువులు వందమంది లేరు, ఒకడే శత్రువు, వాడే కోరిక. నీవు ఏదైనా పాపం చేస్తూ ఉంటే దానికి నీ కోరికే కారణం కాని ఎవరూ ఇతరులు కారణం కాదు. కోరిక, కోపము ఇవన్నీ రజోగుణంలో నుండి పుడతాయి. సజ్జనసాంగత్యం వలన, మహాత్ములకు సేవచేయటంవలన, వృద్ధులకు సేవచేయటం వలన నీకు రజోగుణం తగ్గుతుంది. రజోగుణం తగ్గకుండా కామక్రోధాలు తగ్గవు. అన్ని భోగవస్తువులు నీ ఎదురుగా ఉన్నప్పటికీ మనస్సులోకాని, ఇంద్రియాలలోకాని వికారం లేకుండా ఎప్పడైతే ఉన్నావో అప్పడు నీవు ఒడ్డుకు వస్తావు కాని వస్తువు నీకు లభించటంలేదు కాబట్టి నాకు అక్కరలేదు అనుకొంటే అది కరెక్టు స్టేట్ కాదు. శని ఎక్కడో బయట ఉన్నాడు అనుకోకండి, కోరిక రూపంలోనే శని ఉన్నాడు. మాకు ఆ కష్టాలు వచ్చాయి, ఈ కష్టాలు వచ్చాయి అంటారు, కొంతమంది సుఖపడుతున్నాము అంటారు. ఇవన్నీ ఎవరు చెపుతున్నారు. మీ లోపల ఉన్న మనస్సే చెపుతోంది. ఆ మనస్సును దేవుడికి కనుక ఇచ్చేస్తే ఇంక ఈ గొడవలు ఏమీ ఉండవు. మనం ఏవో కబుర్లు చెపుతాము కాని మన మనస్సును దేవుడికి ఇవ్వము ఎందుచేతనంటే మనస్సు లేకపోతే మనం ఉండమేమో అని భయం.

మీరు ఎన్ని తపస్సులు చేసినా, యోగాభ్యాసాలు చేసినా లోపల ఉన్న ఈశ్వరుడికి మనం వేరుగా ఉన్నాము అనే భావన ఉన్నప్పడు ఏ మనిషికి తిప్పలు తప్పవు. మనస్సు వేరుగా ఉన్నప్పడు వాడు భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించలేడు. పెద్ద పెద్ద ఋషులు కూడా మనస్సు భగవంతుడిలో ఐక్యమైపోతూ ఉంటే కంగారుపడి మనస్సు ఐక్యం అవ్వకుండా ఆపుచేసుకొన్నవారు

ఉన్నారు. మనస్సుపోతే మనం ఉండము అని వారి భయం. భగవంతుడి గురించి మనకు తెలియదు. మన దేహము, మనస్సు మనకు తెలుస్తున్నాయి. దేహం గొడవ, మనస్సు గొడవ లేకుండా మనం గాఢనిద్రలో ఉంటున్నాము. దేహం లేకుండా, మనస్సు లేకుండా మనం ఉండవచ్చు అనేదానికి ఋజువు గాఢనిద్ర. దేహం లేకుండా, మనస్సు లేకుండా ఉన్న స్థితిని మనం పట్టుకొంటే అప్పడు మీరు పొందే సుఖాన్ని చూసి దేవతలు కూడా అసూయపడతారు. మనం దేవుడి సంకల్పాన్ని ఎందుకు అంగీకరించలేము అంటే మనం ఆయనలో కలిసిపోతే మనకి వ్యక్తిభావన ఉండదేమో, మనం సుబ్బమ్మలాగ ఉండలేకపోతే ఎలాగ అని అనుకొంటాము. ఈ సుబ్బమ్మకు దేవుడు అవ్వటం ఇష్టం ఉండదు. సుబ్బమ్మగా ఉండటమే ఇష్టం. ఈ సుబ్బమ్మ సుబ్బమ్మగా ఉన్నంతకాలం పుణ్యం, పాపం ఈ రెండు ఎక్కౌంటులు తప్పవు, ఇది అంతా యమధర్మరాజు వ్రాస్తాడు. దేవుడిలో ఐక్యమైనవాడిని యమధర్మరాజు ఏమీ చేయలేడు. మనందరకు పుణ్యం, పాపం ఈ రెండు ఎక్కౌంటులు ఉంటాయి, చనిపోయేవరకు మనకు దీని గురించి తెలియదు, చనిపోయాక నీ ఎక్కౌంటు ఇది అని వాడికి చూపిస్తారు. నువ్వు జీవించి ఉండగా చేసిన చెడ్డ పనులు, మంచి పనులు అన్నీ ఎక్కౌంటులోకి వెళ్ళిపోతాయి. నీకు మంచి ఆలోచనలు వస్తున్నాయి అనుకోండి అవీ ఎక్కౌంటులోకి వెళ్ళిపోతాయి. ఇతరులతో స్నేహం చేస్తూ వారికి మంచి మాటలు చెప్పకుండా పాడైపోయేమాటలు చెపితే అవీ ఎక్కౌంటులోకి వెళ్ళిపోతాయి. వాటిని బట్టే రాబోయే జన్మ నిర్ణయిస్తారు. మీకు ఎక్కౌంటులో పుణ్యం ఉంటే మంచి జన్మలు వస్తాయి. పుణ్యం సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది, పాపం దుఃఖరూపంలో ఖర్చు అయిపోతుంది. పుణ్యం చేసుకొందాము, అందరికంటే పెద్దవాళ్ళము అయిపోదాము అనే బుద్ధి మనకు ఉంది కాని పరమాత్మలో ఐక్యమవ్వాలి అనే బుద్ధి ఇంకా మనకు రావటంలేదు. పెద్ద పెద్ద యోగులం అని చెప్పకొనేవారికి కూడా అటువంటి బుద్ధి రావటంలేదు ఇంక మనకు ఏమి వస్తుంది.

పరమాత్మ అంటే ఏదో గుడిలో రాయి అనుకొంటున్నారు. పరమాత్మ అంటే అన్ని కాలాలలో ఉన్నవాడు, అంతటా వ్యాపించి ఉన్నవాడు, మన హృదయంలో కూడా సజీవంగా ఉన్నవాడు ఆయనే పరమాత్మ. ఆయనలో ఐక్యమవ్వటానికి ప్రయత్నం చెయ్యి, అదే మన జీవితగమ్యం. జ్ఞానం ఎవరికి అక్కరలేదు. ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు అందుచేత దానిని పొందాలి అనే కాంక్ష కూడా మనకు లేదు. మెరిసేదంతా బంగారం అనుకోవద్దు. మీ ఇంట్లో వారు అందరూ మంచివారు అయ్యి ఉండవచ్చు. వారు ఎంతకాలం ఉంటారు, మీరు ఎంతకాలం ఉంటారు. మీరు ఉండగా వారు వెళ్ళిపోవచ్చు లేకపోతే వారు ఉండగా మీరు

వెళ్ళిపోవచ్చు. ఒకరిని ఒకరు గౌరవంగా చూసుకోవచ్చు కాని మానసికంగా ఎక్కడా ఆధారపడకూడదు. మనం కామక్రోధాలనుండి విడుదలపొందాలి. ఈ జన్మలో వాటిలో నుండి విడుదల పొందలేనప్పుడు వచ్చే జన్మలో విడుదలపొందుతామని ఎక్కడ ఉంది. ఈ రోజు లైట్లు ఉన్నాయి. ఈరోజు చదువుకోవటంలేదు. ఇంక దీపాలు ఆరిపోయాక ఎలా చదువుకొంటాము. చనిపోయాక మనం స్వర్గానికి వెళ్ళటం, నరకానికి వెళ్ళటం కాదు. స్వర్గం అందరికీ బాగుంటుంది. స్వర్గంలో భోగాలు ఉంటాయి. ఆ భోగాలు అనుభవించి మనస్సు తెగ బలిసిపోయి వచ్చే జన్మలో అస్తమాను భోగాలవంక చూస్తుంది. రాగద్వేషాలనుండి విడుదలపొందాలి అనేది అర్థం చేసుకోకుండా స్వర్గానికి వెళ్ళిపోతాము, నరకానికి వెళ్ళిపోతాము అంటే అవి పెర్మనెంట్ కాదు. అసలు ఎందులోనుండి మనం బయటకు రావాలి అనేది మనకు తెలియటంలేదు. ఇప్పుడు మీకు అశాంతి ఉంది. అశాంతి దేనికి వస్తోంది? మీకు ఏదో కష్టం ఉంది కాబట్టి అశాంతి వస్తోంది. మీకంటే ఎక్కువ కష్టాలు ఉన్నవారికి అశాంతి ఎందుకు రావటంలేదు. నిన్న ఒక కలెక్టరుగారు నా దగ్గరకు వచ్చారు. మీరు బాగా సాధన చేసుకొంటున్నారు. మీ అబ్బాయికి ఇంకా ఉద్యోగం రాలేదు కదా. ఎప్పడైనా ఇంకా వాడికి ఉద్యోగం రాలేదేమిటి అని తలంపు వస్తోందా అని అడిగాను. ఆయన ఏమి చెప్పారు అంటే నాన్నగారు దగ్గరగా వచ్చి ముట్టుకోవటంలేదు దూరంగా చూసి వెళ్ళిపోతుంది అన్నారు. మా అబ్బాయి అనే భావన నాకు ఉంది కదా. వాడికి ఇంకా ఉద్యోగం రాలేదు ఏమిటి అని అనుకొంటాను. అసలు ఆ తలంపు రావటం లేదు అని నేను చెప్పను కాని అది నన్ను ఇబ్బంది పెట్టటం లేదు, దూరంగా చూసి వెళ్ళిపోతుంది అన్నారు. అది కరెక్టు. అంటే ఆయనకు సాధనా బలం ఉంది కాబట్టి అది ఆయనను గిల్లేయటంలేదు, వచ్చి అలా చూసి వెళ్ళిపోతోంది.

మనకు రోగం ఏమిటో నిర్ధారణ అయితే అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసుకోవచ్చు. అసలు రోగం నిర్ధారణ అవ్వాలికదా. మనం ఎందులో నుండి బయటకు రావాలి. శరీరంలో నుండి బయటకు రావటానికి మనం సాధన చేయనక్కరలేదు. ఏదో రోజున శరీరం శవం అవుతుంది, ఎక్కడో ఒకచోట పూడ్చేస్తారు. ఇంక మనస్సులో నుండి బయటకు రావాలి. పరమాత్మలో ఐక్యం అయ్యేవరకు అందులో నుండి విడుదల పొందలేము. మన మనస్సు తింగరది. ఇవాళ బాగానే ఉంటుంది రేపు ఎలా ఉంటుందో చెప్పలేము. మనస్సును పరమాత్మలో ఐక్యం చెయ్యాలికాని మన మనస్సు మంచిదేకదా అని దానిని వేరుపాటుగా ఉంచితే రేపు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేము. మనస్సు వేర్పాటుగా ఉన్నంతకాలం ఎప్పటికైనా ప్రమాదమే. అంతటా ఏ వస్తువు అయితే వ్యాపించి

ఉందో దానిలో మనస్సును ఐక్యం చెయ్యాలనే బుద్ధి మనకు రావటంలేదు అన్నారు ఆచార్యులవారు. ద్వైతంలో ఎక్కడా సుఖంలేదు, శాంతిలేదు. ఈ జన్మలో అయినా కోటి జన్మల తరువాత అయినా మీకు శాంతి కావాలంటే, ఆనందం కావాలంటే మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా మీరు అద్వైతానుభవం పొందవలసిందే అన్నారు. మీకు సుఖం వచ్చినా అది దేవుని ప్రసాదం అనుకోవాలి, మీకు దుఃఖం వచ్చినా అది కూడా దేవుని ప్రసాదం అనుకోవాలి. అలా జీవిస్తూ మీరు సమానంగా ఉండగలిగితే మీకు తెలియకుండా మీ మనస్సు వెళ్ళి పరమాత్మలో ఐక్యమైపోతుంది. నిప్పును పొగ కప్పెట్టేస్తుంది అలాగే నీకు ఎంతోకొంత తెలివితేటలు ఉన్నా ఈ కామక్రోధాలు వాటిని కప్పెట్టేస్తాయి, నీ తెలివిని పని చేయనివ్వవు. అద్దం నిండా మసి ఉంటే నీ మొఖం అద్దంలో కనబడదు. ఈ కామక్రోధాలు నీ మనస్సు అనే అద్దాన్ని మసి చేసి వదిలేస్తాయి. ఇంక అసలు నీకు ఏమీ తెలియదు. కోరికలను నెరవేర్చుకొంటూ వాటిని ఎవడూ జయించలేడు. ఎక్కడో ఒకచోట హద్దులో పెట్టుకోవాలి. మనోనిగ్రహం వలన, ఇంద్రియనిగ్రహం వలన, బుద్ధిని సమానంగా ఉంచుకోవటం వలన కామక్రోధముల నుండి బయట పడగలము కాని వాటిని రోజూ శాటిస్‌ఫై చేస్తూ ఉంటే అగ్నిహోత్రంలో నెయ్యి వేస్తే అది ఎలా పెరిగిపోతుందో కోరిక, కోపం కూడా అలా పెరిగిపోతాయి.

వ్యక్తిభావనలో నుండే ద్వేషం వస్తుంది. వ్యక్తిభావనలో నుండే గర్వం వస్తుంది. నువ్వు ఫలానా వ్యక్తిని అనుకొంటున్నావు కాబట్టి ఇంకో వ్యక్తిని చూసినప్పుడు ద్వేషం రావచ్చు, నీకు గర్వం రావచ్చు. ప్రారబ్ధాన్నిబట్టి పాండిత్యం వస్తుంది, ఐశ్వర్యం వస్తుంది. అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, అవి నిజం కాదు. మీ పరిస్థితులు అన్నీ బాగున్నా ఉద్రేకపడకండి, అణిగి ఉండటం నేర్చుకోండి, ఎట్టి పరిస్థితులలో మీ మొఖంలో అవినయం కనబడకూడదు. మీ మొఖంలో గర్వం కనిపిస్తోంది అనుకోండి వారు గర్వంగా ఉంటున్నారు, మేము ఎందుకు ఉండకూడదు అని అనుకరణ వచ్చేస్తుంది, దానివలన మేము పాడైపోతాము కదా. కామక్రోధముల కంటే కీర్తికాముకత్వం ఎక్కువ ప్రమాదం అని మిల్టన్ చెప్పాడు. కొంతమందికి ప్రతీ-చిన్న విషయానికి కీర్తి కావాలి. నువ్వు ఏదైనా మంచి పనిచేసావు, చేసి మర్చిపో, అంతేగాని ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఎందుకు? ఆత్మకు ఇతరులు లేరు. మనస్సుకు ఇతరులు ఉన్నారు. నువ్వు చేసే పని ఇతరులకు తెలియాలి అంటే మనస్సును పెంచుకోవటమే కదా. నువ్వు మంచి పనిచేసావు. దాని వలన పుణ్యం వస్తుంది, అది అనుభవిస్తే పోతుంది దాని వలన లోపల చిత్త శుద్ధి రాదు, లోపల అజ్ఞానమే. అంటే రోడ్డు మీద పల్లకీమోత, లోపల ఈగలు, దోమల మోత. నువ్వు మంచిపని చేసి గొప్పలు ఆశిస్తే గొప్పతనం రావచ్చు, పుణ్యం రావచ్చు కాని చిత్తశుద్ధి

రాదు, చిత్తశుద్ధి లేకుండా మోక్షంలేదు. నీవు చేసే పని వలన చిత్తశుద్ధి రాదు అనుకో, గొప్పలు వస్తాయి అనుకో. మరణానంతరం నీకూడా ఈ గొప్పలు వస్తాయా, చిత్తశుద్ధి వస్తుందా? అంటే నీ కూడా వచ్చే దానిని వదిలేసుకొంటున్నావు, ఇక్కడ ఊరేగింపులు చూసుకొంటున్నావు. నీకు మోక్షం ఎవడు ఇస్తాడు అంటే ఈశ్వరుడు ఇస్తాడు. అందుచేత ఆయన అనుగ్రహం సంపాదించుకోవటం కోసం నువ్వు పని చెయ్యాలి కాని లోకం కోసం కాదు. మనకు చిత్తశుద్ధి లేదు అనుకో మనం శాస్త్రం చదివినా అది తన హృదయాన్ని మనకు ఇవ్వదు.

నువ్వు ఏదైనా పని చేస్తున్నావు అనుకో, ఒక మాట మాట్లాడుతున్నావు అనుకో, నీకు ఏదైనా ఆలోచన వస్తోంది అనుకో దానివలన నీ బుద్ధికి వికాశం రావాలి, నీ హృదయం యొక్క లోతులు పెరగాలి అంతేగాని వాటి వలన నీ బుద్ధి పాడవుతూ ఉంటే నువ్వు ఆ పనులు ఎందుకు చేస్తున్నట్లు. నీ మనస్సును విషయచింతనలో నుండి, శరీరాన్ని భోగాల నుండి విడిపించు. వాటిలో నుండి విడిపించకపోతే ఇంక నువ్వు సాధన ఏమి చేస్తావు. దీపం ఉండగానే చదువుకోకపోతే దీపం ఆరిపోయాక ఇంక ఏమి చదువుతావు. శాస్త్రం ఉంది, నువ్వు ఉన్నావు, అర్థం చేసుకొనే బుద్ధి ఉంది, చెప్పే గురువులు ఉన్నారు. పరిస్థితులు ఇన్నిరకాలుగా అనుకూలంగా ఉన్నప్పుడు ఉపయోగించుకోకపోతే ఇంక మరణానంతరం నువ్వు చేసేది ఏమి ఉంది. నువ్వు సమానబుద్ధిని ప్రాక్టీసు చెయ్యి, అలా ప్రాక్టీసుచేస్తే ప్రాణం నీ శరీరాన్ని విడిచిపెట్టి బయటకు వెళ్ళేటప్పుడు పుణ్యపాపాలను ఇక్కడే వదిలేస్తావు. పుణ్యపాపాలను వదిలేస్తే పునర్జన్మ కారణాలు ఇక్కడే నశించిపోతాయి. పుణ్యపాపాలను ఇక్కడే వదిలేసేవాడు బుద్ధిమంతుడు, వాడు పనిచేసినా చేయనివాడితో సమానము.

నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు. నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే ఏ దోషాలు నిన్ను అంటవు. మనుషులు రకరకాలుగా ఉంటారు, వారి ప్రారబ్దం రకరకాలుగా ఉంటుంది. వారు అలా ఉన్నారు, వీరు ఇలా ఉన్నారు మనం కూడా అలా ఉందాము అనుకోవద్దు, ఇతరుల గొడవ నీకు అనవసరం. నువ్వు ధర్మమార్గాన్ని విడిచిపెట్టవద్దు. పని పని కోసమే చెయ్యి. స్వార్థచింతన లేకుండా పని చెయ్యి. స్వార్థం అంటే భౌతికపదార్థాలు ఆశించటంకాదు. కీర్తి ఆశించినా, గౌరవం ఆశించినా అది స్వార్థమే. స్వార్థంతో పనిచేసే వాళ్ళకంటే స్వార్థం లేకుండా పనిచేసేవాళ్ళకే ఎక్కువ ఫలితం వస్తుంది, అది జీవకోటికి తెలియటం లేదు. ఎంత స్వార్థం ఉంటే అంత లాభం పొందేద్దామని అనుకొంటున్నారు అన్నాడు వివేకానందుడు. నువ్వు మనస్సులో దోషం పెట్టుకొని పనిచెయ్యకు. మనస్సులో దోషం పెట్టుకొని పనిచేస్తే అది నిన్ను బంధిస్తుంది. నువ్వు బాగుపడటానికి నీ మనస్సే కారణం, నువ్వు పాడైపోవటానికి నీ

మనస్సే కారణం. మనస్సులో దోషం పెట్టుకొని పనిచేస్తే నీకు ఏదైనా ఫలితం వచ్చినా మరల పాపం చుట్టుకొంటుంది. నువ్వు ఆత్మచింతన వదిలేసి, దైవచింతన వదిలేసి లోకం గురించి ఎక్కువగా చింతిస్తున్నావు అనుకో దానికి నీ మనస్సులో దోషం కారణం అని నీకు తెలియటంలేదు. నీ మనస్సును శుచిగా, శుభ్రంగా, పవిత్రంగా ఉంచుకోవటానికి మేగ్జిమమ్ ప్రయత్నం చెయ్యి. నీ మనస్సు నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి, ఏకాగ్రంగా ఉండాలి, పవిత్రంగా ఉండాలి. హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు, వారు మాత్రమే సమాధాన పరచుదురు. మనుషులు ఎక్కువగా కలహ ప్రియులు, లౌకికులు పేచీలు పెంచేస్తారు. ఇక్కడ మాటలు అక్కడ చెపుతారు, అక్కడ మాటలు ఇక్కడ చెపుతారు, మొత్తం మీద లోకానికి శాంతి ఇవ్వరు, వెలుతురు ఇవ్వరు, చీకటిని అశాంతిని పంచిపెడతారు, వారే రాక్షసులు. సమాధాన పరచటం అంటే ఎక్కడైనా ఒకరికీ ఒకరికి పేచీ వచ్చింది అనుకో జ్ఞాని ఆ పేచీని పెంచడు, ఇద్దరికి ఎలా చెప్పాలో జాగ్రత్తగా చెప్పి సమాధానపరచి పంపిస్తాడు. లౌకికులు ఎలా ఉంటారు అంటే ఏవైనా గొడవలు వస్తే భార్యాభర్తలను కూడా దూరం చేసేస్తారు. లోపల పవిత్రత ఉన్నవారు మటుకు లౌకికులు చెప్పిన మాటలు వినరు.

కొంతమంది ఎలా ఉంటారు అంటే వారు బాగుపడనక్కరలేదు, ఇతరులు శుభ్రంగా పాడైపోతే చూసి సంతోషిస్తారు, అవి నెగిటివ్ ఫీలింగ్స్, వాటిని మన బుర్రలోనికి రాకుండా చూసుకోవాలి. ఇంట్లో దారిద్ర్యం ఉంటే ఉండనియ్యి గాని మనస్సులో మటుకు దారిద్ర్యం రానివ్వకు. స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. మనందరం తేలిక మనుషులం. మనం తూకం పెంచుకొని లోపలకు ప్రవేశించాలి. తూకం పెరిగితేనే మీ హృదయంలో ఉన్న స్వర్గరాజ్యాన్ని అందుకోగలరు. అభ్యాసం వలన, వైరాగ్యం వలన నీకు తూకం పెరుగుతుంది కాని డబ్బు వలన, పాండిత్యం వలనకాదు. నువ్వు పది పుస్తకాలు చదివి కొంత విషయాన్ని సేకరించి ఎక్కడోచోట దానిని కక్కుతున్నావు అనుకో అది జ్ఞానం కాదు. నీ హృదయంలో ఒక సత్యం ఉంది. దాని తాలుక ఎరుకే జ్ఞానం. దానిని తెలుసుకోవటానికి నీ దేహాన్ని, మనస్సును ఉపయోగించుకోకపోతే ఇంక వాటిని దేనికి ఉపయోగిస్తావు. ఒకవేళ ఇది వదిలేసి నువ్వు ఏవైనా సాధించినా అవన్నీ స్వప్న సమానము. నీకు సుఖంలేదు అనుకో, శాంతి లేదు అనుకో ఇతరులు నిన్ను ధనవంతుడని, పండితుడని చెప్పకొంటే ఏమిటి ప్రయోజనం. మీ కళ్ళతోటి మీరు చూసుకోండి, ఇతరుల కళ్ళతో మిమ్మల్ని చూసుకోవద్దు. మీకు బాహ్యదృష్టివద్దు, చర్మదృష్టివద్దు, లోచూపు అలవాటు చేసుకోండి. లోచూపు అలవాటు అవ్వగా అలవాటు అవ్వగా వస్తువు నీలోపలే ఉంది కాబట్టి ఏదో రోజున అది మీకు ఎరుకలోనికి వస్తుంది.

మనం ఎన్ని మాటలు చెప్పకొన్నా, ఎంత సాధన చేసినా జీవలక్షణాలు దాటకుండా, ఈ భూమి తాలుక మైకం దాటకుండా మనకు ఈశ్వరానుభవం కలుగదు. సారా తాగిన వాడికి వచ్చిన మత్తుకంటే ఒకోసారి లోక విషయాలే మనకు ఎక్కువ మత్తును కలుగజేస్తాయి. అస్తమానూ విషయచింతన వలన ఎక్కువ మత్తు వచ్చేస్తుంది. విషయచింతన వలన చివరకు మీ బుద్ధి పాడైపోతుంది. మీ ఇంట్లో ముసలివారు ఉంటే వారిని అగౌరవపరచ వద్దు. పాపంవారు పని చేయలేరు. వారిని గౌరవంగా చూస్తూ టైముకు అన్నం పెట్టండి. మనమీద ఆధారపడ్డారని అగౌరవంగా చూడవద్దు. నువ్వు మాకు ఏమి ఇచ్చావు అని సూటిపోటి మాటలు అనవద్దు. అటువంటి గొడవలలోనికి వెళ్ళవద్దు. వారు ముసలివారు అయ్యారు, వెళ్ళిపోవటానికి సిద్ధంగా ఉన్నారు, అందుచేత గౌరవంగా చూడండి. ఇవన్నీ వదిలేసి ఊరికే మీరు పుస్తకాలు చదవటం వలన లాభం లేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-11-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఎప్పుడూ మంచి విషయాలను శ్రవణం చేయాలి. ఇప్పుడు అవి మనకు అర్థం అయినా, అర్థం అవ్వకపోయినా కొంత వయసు వచ్చిన తరువాత మనకు వాటి అర్థం తెలుస్తుంది. శ్రవణం చేయాలంటే చాలా శ్రద్ధ ఉండాలి. శ్రద్ధలేనివారు శ్రవణం చేయలేరు. మంచివిషయాలను శ్రవణం చెయ్యగా చెయ్యగా మనకు నెమ్మదిగా సహృదయం కలుగుతుంది. శ్రవణం చేయటం వలన దురాశాపరులకు కొంతదురాశ తగ్గుతుంది. కొంతమంది ఆచార్యులు ఏమని చెపుతారు అంటే ఇంతమంది దేవుళ్ళు లేరు, దేవకిగారి అబ్బాయి ఒక్కడే దేవుడు. ఇన్ని శాస్త్రాలు లేవు ఆయన చెప్పిన భగవద్గీత ఒక్కటే శాస్త్రం, ఇన్ని నామాలు లేవు దేవకి గారి అబ్బాయి నామమే నామం అంటే నారాయణ నామం ఒక్కటే నామం అంటారు. ఆయన చెప్పినట్లుగా నడుచుకోవటమే మనం ఆయనకు సేవ చేయటం. ఆయన ఎలా చెపితే అలా మనం జీవిస్తూ ఉంటే మన జీవలక్షణాలు నశిస్తాయి, మనం మోక్షం పొందుతాము. వేదాలలో కేవలం భక్తిగురించి, జ్ఞానం గురించేకాదు చాలా విషయాలు చెప్పారు. ఇల్లు ఎలా కట్టుకోవాలి, మన జీవన విధానం ఎలా ఉండాలి, కుటుంబ పద్ధతి ఎలా ఉండాలి ఇలా చాలా విషయాలు చెప్పారు. వేదాలలో ఉన్న సారాన్ని, కేవలం మోక్షానికి పనికివచ్చే విషయాలను భగవద్గీతలో చెప్పారు అందుచేత భగవద్గీతను మోక్ష శాస్త్రం అంటారు. వేదంలో భాష కఠినంగా ఉంటుంది, అర్థం చేసుకోవటం కష్టం. భగవద్గీతలో భాష అందరికీ అర్థమయ్యేలాగ తేలికగా ఉంటుంది, చిన్నచిన్న మాటలలో చెపుతాడు. మీ శరీరాలు చనిపోతే అందరూ

కంగారుపడిపోతున్నారు. చావు వచ్చేటప్పటికి వేమూ చనిపోతున్నాము అని కంగారుపడిపోతున్నారు. చావు అంటే కంగారుపడనక్కరలేదు. మీకు పాత శరీరాలు పోయి కొత్త శరీరాలు వస్తాయి. అంటే బట్టలు మార్చుకోవటం ఎటువంటిదో శరీరాలు మార్చుకోవటం కూడా అటువంటిదే అని చెప్పాడు. శరీరం శిథిలం అయిపోయాక ఇంక జీవుడికి ఆ శరీరం పనికిరాదు అన్నప్పడు ఆ శరీరం చనిపోతుంది కాని జీవుడు చనిపోడు. అంటే మరణానంతర జీవితం కూడా ఉంది.

మనం ఎప్పడూ భగవంతుడు లేడని జీవించకూడదు. భగవంతుడు ఉన్నాడనే జీవించాలి. నమ్మినవారికి సొమ్ము, నమ్మనివారికి దుమ్ము. మన మనస్సు మనకు తెలుస్తోంది కదా, వాడినే జీవుడు అంటారు. శరీరం మరణించాక వాడు అలా కంటిన్యూ అయిపోతాడు. శరీరం నుండి ప్రాణం బయటకు పోయేటప్పడు ఏ తలంపులు అయితే మిమ్మల్ని గట్టిగా పట్టుకొన్నాయో వాటిననుసరించి మీకు కొత్త శరీరాన్ని ఇస్తాడు. ఏ కుటుంబంలో జన్మించాలి, ఎక్కడ జన్మించాలి అనేది మీ ఇష్టం కాదు. మీ సంస్కారాలను బట్టి భగవంతుడే నిర్ణయిస్తాడు. మనం స్వతంత్రులం కాదు, మన చేతిలో ఏమీ లేదు. మనం శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవాలి. మనకు చెడువాసనలు రాకుండా చూసుకోవాలి. మనకు మంచిపనులు చేసే శక్తి లేకపోతే చెడ్డపనులు మాత్రం చేయకూడదు. మనకు మంచిఆలోచనలు, మంచితలంపులు వస్తూ ఉండాలి. బుద్ధిసూక్ష్మతను పెంచుకొంటూ రావాలి. ఎవరు పెద్ద మనిషి అని శాస్త్రంలో చర్చ వచ్చింది. మంచి మంచి బట్టలు వేసుకొని మెడనిండా గొలుసులు పెట్టుకొని కార్లలో తిరిగేవారు పెద్ద మనుషులు కాదు. కొంతమంది పెద్ద పెద్ద చదువులు చదువుతారు కాని మూర్ఖత్వంగా ఉంటారు, వారు పెద్దమనుషులు కాదు. ఎవడు పెద్ద మనిషి అంటే వాడు మనస్సులో ఉన్నదే నోటితో చెపుతాడు, నోటితో చెప్పిందే చేతితో చేస్తాడు వాడు పెద్ద మనిషి. కొంతమంది మనస్సులో ఉన్నది నోటితో చెప్పరు, నోటితో చెప్పింది చేతితో చెయ్యరు, వాడు పెద్దమనిషి కాదు. ఎవడైతే మనస్సులో ఉన్నది నోటితో చెప్పి, అదే చేతితో చేస్తాడో వాడి మనస్సు తేటగా ఉంటుంది. మనస్సు తేటగా ఉండటం వలన లోపల ఉన్న వస్తువు వాడికి స్ఫురిస్తూ ఉంటుంది. అందరి హృదయాలలో అంతర్యామిగా నేను ఉన్నాను అని పరమాత్మ చెపుతున్నాడు. అది మన బుద్ధికి అందటంలేదు కాబట్టి అది అసత్యం అనుకొంటున్నాము. మన బుద్ధి గంటకో రకంగా ఉంటుంది. ఇటువంటి బుద్ధికా దేవుడు అర్థమయ్యేది. దానికి ఎంత తపస్సు ఉండాలి, ఎంత నిగ్రహం ఉండాలి. మీకు అర్థంకాకపోతే మనకు అర్థం అవ్వటంలేదు అనుకోవాలి కాని భగవంతుడు చెప్పేది అసత్యం అనుకోకూడదు.

పని చేసేటప్పుడు ఇష్టంగా చెయ్యి. ఫలకాంక్ష నీ మనస్సులోనికి రానివ్వకు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. ఫలితం నీ చేతిలో లేదు. నీ చేతిలో లేనిదానిగురించి నువ్వు ఎందుకు ఆలోచించటం. ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది. ఇచ్చేస్తే గర్వపడవద్దు ఇవ్వకపోతే ఎందుకు ఇవ్వలేదు అని నిరుత్సాహపడవద్దు. ఏది ఎందుకు చేస్తున్నాడో మనకు తెలియదు. ఫలితం ఈ జన్మలోనే ఇవ్వాలని లేదు. ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అని ఆయన నిర్ణయించుకొంటాడు. ఫలితం మీద ఆశ పెట్టుకోవద్దని చెపుతున్నాను అని అసలు పని మీద విరక్తి పెట్టుకోవద్దు. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి. కామం ఇంద్రియాలలో, మనస్సులో, బుద్ధిలో దాక్కొని ఉంటుంది. శరీరం చనిపోయినా మనస్సు ప్రయాణం చేస్తుంది కదా అందులో దాక్కొని ఉంటుంది. ఈ జన్మలో అయినా రాబోయే జన్మలో అయినా దానికి మించిన శత్రువు నీకు లేదు. అది నీకు శత్రువులాగ కనిపిస్తే ఫరవాలేదు, అది మిత్రుడులాగ కనిపిస్తోంది. అందువలన దానిని తొలగించుకోవటం నీకు కష్టమవుతోంది. దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, నీ సాధన అంతా దానిమీద గురిపెట్టు. అస్తమానూ లౌకిక విషయాలు తలపెట్టుకొంటే కోరిక వస్తుంది. అప్పుడు దానిని నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తాము. నెరవేరితే ఆశ పెరిగిపోతుంది. నెరవేరకపోతే అది ఈశ్వర సంకల్పంలో లేదు అని అనుకోము, నెరవేరలేదని ఎవరిమీదో కోపం ప్రారంభమవుతుంది, ద్వేషం ప్రారంభమవుతుంది. నెరవేరకపోయినా దేవుడే కారణం. ఎవడో మనిషిని అడ్డుపెట్టుకొంటాడు, చేసేది ఆయనే. మనలో అంతర్యామిగా ఉండి ఇవి అన్నీ చేసేది భగవంతుడే. అది మనకు తెలియక మనుషులమీద కోపం వస్తుంది. రోజూ కోపం వచ్చేవారికి వివేకం తగ్గిపోతుంది, బుద్ధి పాడైపోతుంది. నీ బుద్ధి పాడైపోయిన తరువాత నీకు సంపద ఉంటే మటుకు ఏమి చేసుకొంటావు. దైవచింతన లేకుండా, సామాజిక స్పృహ లేకుండా నిరంతరం విషయాలను చింతిస్తూ ఉంటే చివరకు నీ గతి నంబర్‌వన్ పిచ్చోడికింద తయారవుతావు, ఇంక నీకు శాంతి లేదు, మోక్షం లేదు. అందుచేత నీకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి, ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయి అని జాగ్రత్తగా పరిశీలన చేసుకో.

సాధనలో మెలకువలు ఇక్కడ భగవంతుడు చెపుతున్నాడు. మీకు ఎవరి మీద అయితే ఎక్కువ మమకారం ఉందో అది నెమ్మదిగా తగ్గించుకోలేకపోతే నీ మనస్సు భగవంతుడివైపుకు తిరగదు. మమకారాన్ని తగ్గించుకో, స్వార్థాన్ని తగ్గించుకో. నీ శరీరాన్ని ఎక్కువ సుఖపెట్టేయవద్దు. నీ శరీరాన్ని ఎక్కువ సుఖపెడితే ఆ సుఖాలకు బానిస అయిపోతుంది. ఎవరి మీద అయితే మీకు ఎక్కువ మమకారం ఉందో అక్కడే మీ మనస్సు ఉంటే, ఏ సుఖాలకు అయితే మీ శరీరం

అలవాటుపడిందో ఆ సుఖాలలోనే మీ మనస్సు ఉంటే ఇంక దేవుడిని ఎప్పడు తెలుసుకొంటుంది, ఎలా తెలుసుకొంటుంది అని ప్రశ్న. ఎంత ప్రాక్టికల్‌గా చెపుతున్నాడో చూడండి.

నాలోపల మీరు ఉన్నారు, మీలోపల నేను లేను ఎంత వండర్‌ఫుల్‌గా చెప్పారో చూడండి. ఇది మీకు అర్థమైతే ఇంక ఏమీ అక్కరలేదు. మనం కళ్లు ఉండి చూడలేము, చెవులు ఉండి వినలేము. సబ్జెక్టు ఎదురుగుండా పెట్టుకొని, భగవంతుడు చెప్పినా దాని గురించి ఆలోచించి బాగు పడే ప్రారబ్ధం మనకు లేదు, ఎందుచేతనంటే మన బుద్ధి మంచిది కాదు. నా లోపల మీరు ఉన్నారు, మీ లోపల నేను లేను, ఇది అర్థం చేసుకొంటే మీ మనస్సు సడన్‌గా పడిపోతుంది. మీకు పరిమితులు ఉన్నాయి, ఇష్టాలు ఉన్నాయి, అయిష్టాలు ఉన్నాయి, కోపాలు ఉన్నాయి, రాగద్వేషాలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి, వాటిలో నేను లేను కాని మీరు మటుకు నా లోపలే ఉన్నారు. ఆయన ఎక్కడైతే లేడో అవి తగ్గించుకొంటే మనం ఆయనలో ఐక్యమైపోతాము. మనస్సు ఎక్కడికి పరుగెడుతోందో, ఏ విషయాల మీదకు వెళుతోందో అవి తగ్గించుకోండి, దాని పొంగును ఆపు చేయండి, దానిని విత్‌డ్రా చేయండి, దాని కూడా మీరు వెళ్ళిపోవద్దు. మనస్సు కూడా మీరు వెళ్ళకుండా ఉంటే అది నెమ్మదిగా వెనుకకు వచ్చేస్తుంది. ఇంట్లో అయినా, బయట అయినా మీరు కోపంగా ఉన్నప్పుడు మాట్లాడకండి, మాటలు తగ్గించుకోండి, కొంతసేపు మౌనంగా ఉండండి. ఎక్కువ కోపంగా ఉంటే చిరాకు మాటలు వస్తాయి, అశాంతి మాటలు వస్తాయి. కోపంగా ఏమైనా మాట్లాడితే మీరు ఏమీ అనుకోకండి అని మరల చెప్పవలసిన పరిస్థితి వస్తుంది. కోపంగా మాట్లాడటం ఎందుకు, మీరు ఏమీ అనుకోవద్దు అని చెప్పటం ఎందుకు. ఎందుకు వచ్చినగొడవలు ఇవన్నీ. రోజూ కాళ్ళు చేతులు బాడిచేసుకోవటం, కడుక్కోవటమేనా మనకు పని.

గాలిలో దీపం ఎలాగైతే నిలబడదో మీకు కోపం ఎక్కువగా ఉన్నప్పుడు, ఉద్రేకంగా ఉన్నప్పుడు మీకు కొంత తెలివి ఉన్నా అది నిలబడదు అని వాల్మీకి చెప్పాడు. మీకు ఉద్రేకాలు, కక్షలు ఉన్నప్పటికీ నన్ను పొందటంకోసం వాటిని తగ్గించుకోండి అన్నాడు ఏసు. మీకు చేతనైతే ఉపకారాలు చేయండి, అపకారాలు మటుకు చేయవద్దు. మీ శరీరాన్ని భోగాలకు ఇచ్చేసి, లోకంలో ఉన్న ఆకర్షణలకు మనస్సును ఇచ్చేసి ఇంక మీరు ఎప్పడు సాధన చేస్తారు. మీ ఇష్టం వచ్చినట్లు మీరు ఉన్నా మరణం ఆగుతుందా, అది సడన్‌గా వచ్చేస్తుంది. ఏ మనిషి ఏ రోగాన్ని తప్పించుకొన్నా మరణాన్ని మాత్రం తప్పించుకోలేడు. మనం చేసే కర్మను బట్టి జన్మ వస్తుంది. జన్మ వస్తే కర్మ చేస్తాము. అసలు కర్మ ఎందుకు వస్తుంది అంటే రాగద్వేషముల నుండి కర్మ వస్తుంది. రాముడు కర్మ చేసాడు అది వాడిని అంటలేదు. రాముడు అనేకమంది

రాక్షసులను సంహరించాడు వాడికి ఏమీ పాపం అంటలేదు. ఎందుచేతనంటే అక్కడ ఇష్టం లేదు, అయిష్టం లేదు, రాగం లేదు, ద్వేషం లేదు. అలాగ నువ్వు కూడా సమానబుద్ధితో పనిచేస్తే నీకు ఏదీ అంటదు. నీ తలకాయలో మురికి ఎక్కువగా ఉంది, బురద ఎక్కువగా ఉంది. నువ్వు సాధన చేసి ఆ బురదను తొలగించుకో. నీకు ఉన్న ఇష్టాలు, అయిష్టాలే ఆ బురద. నువ్వు ఆపరేషన్ చేయించుకొని ఆ బురదను తొలగించుకోవటం కుదరదు. నువ్వు సాధన చేసి గురువు దయ వలన, ఈశ్వరుని దయవలన ఆ బురదను తొలగించుకోవాలి కాని కేవలం నీ తెలివితేటల వలన ఆ బురద పోదు. ఆ బురద అనేక జన్మల నుండి వస్తోంది. ఆ బురద ఉన్నంతకాలం కామెర్లవాడికి లోకం అంతా పచ్చగా కనిపించినట్లుగా నీకు మంచి అంతా చెడ్డగా కనిపిస్తుంది, చెడ్డ అంతా మంచిగా కనిపిస్తుంది. మీ మాటలోగాని, మీ చేతలోగాని మీరు కనబడకూడదు. అంటే మీరు మాట్లాడుతూ ఉండాలి, అక్కడ వ్యక్తిభావన కనబడకూడదు. వివేకం పాడు చేసే మాటలు మాట్లాడవద్దు, వివేకం పాడుచేసే పనులు చేయవద్దు. బహుజాగ్రత్తగా ఉండండి. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో సాధకుడు కూడా అంత జాగ్రత్తగా ఉండాలి. నువ్వు శ్రద్ధగా పనిచెయ్యి. ఏదీ ఆశించవద్దు. ఎక్కడైతే ఆశ ఉందో అక్కడ నిరాశ ఉంటుంది.

వైరాగ్యం అంటే మీరు ఎర్రబట్టలు వేసుకొన్నారా, తెల్లబట్టలు వేసుకొన్నారా, పసుపుబట్టలు వేసుకొన్నారా అని కాదు. మీరు స్త్రీయా, పురుషుడా అని కాదు, మీ మెడలో బంగారం ఉందా, ఇంట్లో మీరు ఎలా ఉంటున్నారు అని కాదు. ఇవి అన్నీ బాహ్యవిషయాలు, వీటినిబట్టి ఏమీ చెప్పలేము. మీ మనస్సులో ఏ రకమైన కోరిక లేకుండా, ఏ రకమైన వికారం లేకుండా, నీ మనస్సు లోకంలో ఎక్కడా వాలకుండా ఉంటే అది వైరాగ్యం. మనందరం గొట్టెలం, మనకు అనుకరణతప్పించి వైరాగ్యంలేదు, వివేకంలేదు. వయస్సులో ఉన్నప్పుడు మనం పొగరుబోతు పనులు చేస్తాము. పాండిత్యం, గౌరవం, ఐశ్వర్యం, అధికారం వీటిని ఇముడ్చుకోవటం కష్టం, వాటిని జీర్ణం చేసుకోవటం కష్టం. అవి జీర్ణం అవ్వకపోతే మనం పతనమైపోతాము. అందుచేత మీరు వయస్సులో ఉన్నారని ముసలివారిని పట్టుకొని తిట్టకండి. మీరు ఏది తింటే అది వారికి కూడా పెట్టండి, ప్రేమగా చూడండి. దేవకిగారి అబ్బాయిని స్మరించుకోండి. ఆయన చెప్పిన మాటలను శ్రవణం చేయండి. ఆయన చెప్పినట్లుగా జీవించండి. అదే మనం ఆయనకు చేసే సేవ. ఈ సృష్టి రూపంలో ఉన్నవాడు ఆయనే. ఈ సృష్టిలో మీరు ఎవరికి సేవ చేస్తున్నా అది దేవకిగారి అబ్బాయికే వర్తిస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 12 | చించినాడ (శివరాత్రి) |
| ఫిబ్రవరి | 21 | శివ కళ్యాణ మండపం, భీమవరం |
| ఫిబ్రవరి | 28 | గీతా మందిరం, చించినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# వచ్చిన పని మరిచిపోవద్దు

"మనము ఈ భూమి మీదకు వచ్చిన పనిని మరిచిపోకూడదు" అంటారు భగవాన్ శ్రీ రమణమహర్షి. వాస్తవంగా మనమెవరిమో అనుభవైకవేద్యం చేసుకొనే మహత్కార్యం నిమిత్తం పరమాత్మ ఈ మానవజన్మ ప్రసాదించి భూమి మీదకు పంపారు. కాబట్టి వాస్తవంగా నేనెవరో? తెలియబడాలనే ఉన్నత ఆశయానికి తగినట్లుగా శ్రద్ధ, పట్టుదల కలిగి యుండి కాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ, దానికొరకే జీవించాలి. యాంత్రికంగా దేహాత్మబుద్ధితో బ్రతుకుతూ ఉంటే రోజులు, వారాలు, నెలలు వృధాగా దొర్లిపోతూ ఉంటాయి. కాని మహాత్ములు కాలాన్ని తమకు అనుకూలంగా మలచుకొని ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకొంటూ, జీవితాన్ని జీవిస్తారు. కాలాన్ని మన సాధనా లక్ష్యమైన "మనోనాశానికై" సద్వినియోగం చేసుకోవడం గొప్ప కళ. మితాహారం, మితభాషణ, మిత నిద్రానియమాలను పాటిస్తూ, మనస్సుకు శిక్షణనిస్తూ, త్రికరణశుద్ధిని సాధించాలి. మన భవిష్యత్తుకు మనమే కర్తలం కాబట్టి ఎరుకతో జీవించాలి, అట్లు కానిచో మన కళ్ళముందే కాలం వృధాగా కరిగిపోతుంది. భగవంతుడు కాలరూపంలో మనకిచ్చిన మానవజీవితాన్ని వృధాచేసిన వారమవుతాము. పరమాత్మచే బహుమతి ప్రసాదింపబడిన మానవజన్మను సద్వినియోగం చేసుకొని, దేహం జీవించి యుండగానే, ఇప్పుడే ఇక్కడే స్వరూప ఎరుకలోకి మేల్కోవాలి! భగవాన్ శ్రీరమణమహర్షి "నీవెవరివో తెలిసికో" అని బోధించారు, ఆ తెలిసికొనుటకే పరిపూర్ణంగా ఈ జీవితకాలాన్ని ఉపయోగించు కొని వచ్చిన పనిని పూర్తిచేయాలి.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# తలంపే - అశాంతి

తలంపుల సమూహమే మనస్సు. తలంపుల విషయంలో అజాగ్రత్త వహిస్తే అవి మన కూడా వస్తాయి. తలంపులను కనిపెట్టటానికి కొంత సమయాన్ని మనం ఖర్చుపెట్టాలి. చక్కని ఆలోచన కూడా తపస్సే. మనం జ్ఞాపకాలనే తలంపులను ప్రోగుజేసుకొని వర్తమానానికి దూరమౌతాము. శాశ్వత జీవితంకోసం నిరంతరం, సామర్థ్యంతో, నిండుగా జీవించినవాడే కృతార్థుడు అవుతాడు. మనస్సు ఓ దర్పణంలాంటిది. మనం ఏ తలంపులకు అతుక్కుపోతేమో ఆ వస్తువే మనస్సు అయిపోయే లక్షణం ఉంది. మనలో పాతుకుపోయిన గర్వం, అసూయత ఉంటే మనమే బాధపడాలి అవి అవలక్షణాలు అవి పుండువంటివి. మనలను చూచి ఎవరైనా నవ్వుతూ ఉన్నారు అనుకొంటే ఆ పుండును కదిపినంత బాధకలుగుతుంది. కాని పుండును నయం చేసుకొనే మార్గంలో ఉండి నయమైతే ఎవరు ముట్టుకొన్నా బాధ ఉండదు మన తలంపులచే తనే మనం మన చుట్టూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకొంటున్నాము. అన్ని భ్రమలకు తలంపే మూలవిత్తనం. ఒక్క తలంపుతో అనేక గంటలు గడిపే సామర్థ్యం మనకు ఉంటుంది. అప్పుడు మనం దానిని "ఈ తలంపులు ఎవరికి?" అని ప్రశ్నిస్తే అవి పరిగెత్తుకుంటూ పారిపోతాయి. ఆ తలంపులను వీధి గుమ్మంలోంచి బయటకు కొడితే దొడ్డిగుమ్మంలోంచి తిరిగి సిద్ధమౌతాయి. మనస్సు వెలుగుతున్న దీపం లాంటిది అని ఊహించుకోవాలి. కోరికలు అనే చమురు లేకపోతే మనస్సు ఆరిపోతుంది. మనస్సు ఒక్క క్షణంలో ప్రగాఢమైన ప్రేమలో ఉంటుంది. మరుక్షణం ద్వేషంతో అల్లకల్లోలమై ఉంటుంది. మనస్సు నీటిబుడగ దానిపై సూర్యకాంతి పడితే ఇంద్ర ధనుస్సులా మనోహరంగా ఉంటుంది. పరుగెత్తి పట్టుకొంటే ఆ క్షణంలోనే అంతమౌతుంది. సంపదను మరింత పెద్ద బుడగ చేయాలని చూస్తాము జీవితాన్ని అంతం చేసుకొంటాము. శ్రీనాన్నగారు "ఇల్లు అంటుకొంటే అందుల్లోంచి బయట పడటానికి మనిషి ఎంత తపన పడతాడో అదే విధంగా ఎవడు తన పాపపు తలంపులోంచి బయట పడటానికి ప్రయత్నం చేస్తాడో వాడు దేవుణ్ణి దర్శిస్తాడు" అన్నారు. నిశ్శబ్దంలో మహాశాంతిని, సుఖాన్ని పొందుతాము. దానికి గురు కరుణ తోడుగా ఉండాలి. ప్రాణ ప్రయాణ సమయంలో ధనవంతుడు తను లేకపోతే ఆస్తి పాడైపిల్లలు దరిద్రులు అవుతారని తనకు లేనిదారిద్ర్యాన్ని తాను ఆపాదించుకొని దరిద్రుడుగా జన్మిస్తాడు. అదే దరిద్రుడు సంపద ఉంటే సుఖంగా ఉండగలమని తలుస్తూ సంపద గల జన్మలోకి వెడతాడు. తలంపులు తంటాలను తెచ్చిపెడతాయి. నిజ గమ్యం తలంపుల వల్లనే తప్పిపోతాము. ప్రయత్నంతో తలంపులను అరికట్టి నిజధామం వైపు పయనమవ్వాలి. అదే మన లక్ష్యం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**